క్లుప్తంగా

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా జాషువా


ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును సాధించిన జాషువా

బొబ్బిలి రూరల్: జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు గోకుల్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీర్ల జాషువా జయప్రసాద్ ఎంపికయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్స్ ఇండియా సంస్థ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా జాషువాను పలువురు అభినందించారు.

మొక్కల పంపిణీ


రైతులకు టేకు మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రకాష్ కపిల

సంతకవిటి: మండలంలోని సిరిపురం, రామరాయపురం, హొంజరాం గ్రామాల్లో పీపుల్స్ ఫర్ లోక్‌సత్తా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శనివారం మూడు వేల మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్షుడు ప్రకాష్ కపిల తెలిపారు. కార్యక్రమంలో పైడి గోవిందరావు, పంచాది రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


ప్రేయర్ సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ దుర్గారావు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయపాలన పాటించాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని గురవాం జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



సంకిలిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రేగిడి: మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కర్తవ్యమే దైవం అనే అంశంపై సత్యసాయి సేవా సంస్థలు ఈ పోటీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా రేగిడి విశ్వసాయి మందిరం కన్వీనర్ మామిడి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామినాయుడు, లక్ష్మణరావు, సేవాదల్ సమన్వయకర్త శాసుబిల్లి తులసి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కాలువలను పునరుద్ధరించండి


కమిషనర్ రామప్పలనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ ఐటీ నుంచి పొనుగోటివలస గ్రామంలోని సాగునీటి చెరువులకు గతంలో ఉండే సాగునీటి కాలువలను పునరుద్ధరించాలని గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడును శనివారం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో జీఎంఆర్ ఐటీ పరిసర ప్రాంతాల నుంచి మూడు కాలువల ద్వారా సాగునీరు పొనుగోటివలస చెరువులకు రైతులు చెప్పారు. ఇప్పుడు ఆ మూడు కాలువలను ఒక కాలువకు అనుసంధానం చేసి ఒకే చెరువుకు నీరు పంపిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి కాలువలను పునరుద్ధరించాలని కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

దళితులకు కూటమి దగా

నెల్లిమర్ల రూరల్: దళితులను కూటమి ప్రభుత్వం దగా చేసిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా దళితులకు ఏ రకమైన మేలు చేయలేదన్నారు. కనీసం సబ్సిడీ రుణాలు కూడా అందించలేదన్నారు. దళితులపై దాడులు తప్ప మరేం చేయలేదన్నారు. తక్షణమే దళిత వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

బై బై గణేశా..


బాడంగి: ముగడలో వినాయకుడి ఊరేగింపు

వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. వాడవాడలా ఏర్పాటు చేసిన మంటపాల్లో ఈ నెల 27న వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి శనివారం సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే రోజు రాత్రి విగ్రహాలను మేళతాళాల నడుమ ఊరేగిస్తూ నిమజ్జనోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కొన్ని చోట్ల లడ్డూ వేలంపాటలు నిర్వహించారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. నిమజ్జనోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి నెట్‌వర్క్


రామభద్రపురం: వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న చింతలవీధి కమిటీ సభ్యులు


రాజాం సిటీ: పొనుగుటివలసలో వినాయక నిమజ్జనంలో భాగంగా తప్పెటగుళ్ల ప్రదర్శన


రాజాం: మారుతీనగర్ గణనాథుడ్ని ఊరేగిస్తున్న భక్తులు


తెర్లాం: వెలగవలసలో రూ.14 వేలకు లడ్డూ సొంతం చేసుకున్న రఘుమండ కూర్మారావు

నేత్రదానంపై అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్, మగటపల్లి కల్యాణి నేత్ర సేకరణ కేంద్రం (శ్రీకాకుళం) ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు మాట్లాడుతూ..నేత్రదానం చేయడం ద్వారా వేరొకరికి చూపు ప్రసాదించే వారమవుతామని చెప్పారు. బీపీ, సుగర్, ఉబ్బసం ఉన్న వారు సైతం నేత్రదానం చేయవచ్చని తెలిపారు. నేత్రదానంపై లేనిపోని అపోహలు విడనాడి ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, హెచ్‌ఎం మల్లేశ్వరరావు, జూనియర్ రెడ్‌క్రాస్ టీచర్ అదపాక దామోదరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొరాయించిన బస్సు

● స్తంభించిన ట్రాఫిక్

బాడంగి: రోడ్డుపై ఆర్టీసీ బస్సు నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పార్వతీపురం డిపో నుంచి రంగరాయపురం, బాడంగి మీదుగా షికారుగంజి వరకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఉదయం 8.30 గంటల సమయంలో ముగడ – భీమవరం మధ్య పాల్తేరు చానల్ సమీపంలో మొరాయించింది. దీంతో ప్రయాణికులు భీమవరం, కునుకువానివలస వరకు నడిచి అక్కడ నుంచి ఆటోలపై గమ్యస్థానాలకు చేరుకున్నారు. సింగిల్ రోడ్డులో బస్సు మొరాయించడంతో మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది.


ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

ఘనంగా గురుపూజోత్సవం


తెర్లాం: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ప్రజాప్రతినిధులు


రామభద్రపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


బాడంగి : హైస్కూల్‌లో గురువులను సత్కరిస్తున్న విద్యార్థులు

మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో గురు పూజోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. మాజీ రాష్ట్రపతిగా, విద్యావేత్తగా రాధాకృష్ణన్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ఉపాధ్యాయులు నడవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్


బొబ్బిలి: ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు


బొబ్బిలి: ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఆకస్మిక తనిఖీ


విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకుంటున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు

రేగిడి: మండలంలోని చాటాయివలస ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధన చేపట్టాలిన హెచ్‌ఎం చింత శ్రీధరరావుకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కె.శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ


జీఎస్ పురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీడీఓ కె.హేమసుందర్

సంతకవిటి: మండలంలోని బొద్దూరు, జీఎస్ పురం, బిళ్లాణి, తలతంపర, మిర్తివలస, మందరాడ, తాలాడ, తదితర గ్రామాల్లోని సచివాలయాలను చీపురుపల్లి డివిజినల్ డవలప్‌మెంట్ అధికారి కె.హేమసుందర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుపై ఆరా తీయడంతో పాటు రికార్డులు, హాజరు పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహ కల్పించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టాలివ్వాలి..


ధర్నా చేస్తున్న గిరిజనులు

బొబ్బిలి: మెంటాడ మండలం ఆగూరులోని 57 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూములను సాగు చేస్తున్న గిరిజనులకు సాగు పట్టాలివ్వాలని రైతులు కోరారు. ఈ మేరకు కౌలురైతు సంఘ జిల్లా అధ్యక్షుడు రాకోటి రాములు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు.

విజయలక్ష్మి సేవలు ప్రశంసనీయం

● తహసీల్దార్ హేమంత్‌కుమార్


విజయలక్ష్మిని సన్మానిస్తున్న తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్

తెర్లాం: తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన ఎం.విజయలక్ష్మి సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. రామభద్రపురం బదిలీపై వెళ్తున్న విజయలక్ష్మిని శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీద్దాం


రైతుపోరు నిరసన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్, తదితరులు

● ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: కూటమి ప్రభుత్వ హయాంలో రైతులకు నానాటికీ అగచాట్లు తప్పడం లేదని.. ఒక బస్తా యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లే దీనికి నిదర్శనమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. రైతు సమస్యల పట్ల ఈ నెల 9న డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు.. ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు ఆర్‌బీకేలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిందే తప్ప రైతులకు చేసిన మేలు ఏమీ లేదని ఎద్దేవా చేశారు. విత్తనాలు, ఎరువుల కోసం గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని మేల్కొలపాల్సిన సమయమొచ్చిందన్నారు. రైతులు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడులకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం శోచనీయమని వాపోయారు. సమయానికి రైతులను ఆదుకోలేని ప్రభుత్వం ఉంటే ఎంత.. ఊడితే ఎంత అని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, టౌన్, రూరల్ పార్టీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, యాలాల వెంకటేష్, సర్పంచ్‌లు వాకముల్లు చిన్నంనాయుడు, కోనారి అప్పారావు, ఉమామహేశ్వరరావు, రాంబాబు, డాక్టర్ బి.నరేంద్ర, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ తీగలను తొలగించండి

● సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల డిమాండ్


సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ శంకరరావు

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని పలుమార్లు విద్యుత్ శాఖాధికారులను కోరినా పట్టించుకోలేదని పలువురు సర్పంచ్‌లు వాపోయారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు అరసాడ శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌లు ట్రాన్స్‌కో ఏఈ సాంబశివరావును నిలదీశారు. మనుషులు, పశువుల ప్రాణాలు పోతేగాని తీగలు సరిచేయరా అని మెట్టవలస సర్పంచ్ మాధవ, గొర్లెసీతారాంపురం సర్పంచ్ తిరుపతిరావు, తదితరులు ప్రశ్నించారు. అగ్రికల్చర్ ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ.. ఎరువుల కోసం రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని సూచించారు. కమ్మవలస సర్పంచ్ పిల్లా వసుంధర మాట్లాడుతూ.. పంచాయతీల్లో నిధులు లేవని, విద్యుత్ బిల్లులు కూడా కట్టలేకపోతున్నామని సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. సభ్యులు తెలియజేసిన సమస్యలను పరిష్కరించాలని వైస్ ఎంపీపీ శంకరరావు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రవికుమార్, డిప్యూటీ ఎంపీడీఓ భాస్కరరావు, డీటీ గౌరీశంకర్, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సుంకాలను వ్యతిరేకించాలి



ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

రాజాం సిటీ: దేశ ప్రయోజనాలు కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని.. అమెరికా విధిస్తున్న సుంకాలను వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతీయ సరుకుల దిగుమతి సుంకాన్ని 50 శాతం పెంచడం వల్ల మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. గార్మెంట్స్, టెక్స్ టైల్స్, ఆక్వా ఉత్పత్తుల ధరలు పడిపోయాయని తెలిపారు. సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుంచే జరుగుతున్నాయని.. రొయ్యల ధరలు పడిపోవడంతో సముద్రతీర ప్రాంత ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని అన్నారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవన్నారు. ఇన్ని విధాలుగా అమెరికా నిబంధనలను కఠినతరం చేస్తున్నా మోదీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే రాష్ట్ర ప్రయోజనాల కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరి కాదన్నారు. కార్యక్రమంలో కార్మికులు అనీల్, కనకరాజు, గంగరాజు, సారయ్య, ప్రకాష్, సీత, సత్యారావు, శంకరరావు, శ్రీనివాసరావు, రాజారావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు


మాట్లాడుతున్న ఎస్సై ప్రసాదరావు

రామభద్రపురం: బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రత్నం, తహసీల్దార్ అజు రఫీజాన్, ఎస్సై వి. ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలతో బాల్య వివాహాల నిర్మూలన కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు వివరించడంతో పాటు లైంగిక వేధింపుల చట్టం, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ గిరిధర్, వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ అనిత, డీసీపీయూ సోషల్ వర్కర్ సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, రత్నకుమారి, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు